## కథ

అర్ధరాత్రి.....!!

పెరట్లో దబ్బుమన్న చప్పుడయింది...మరి కొద్ది సేపట్లో తలుపులు విరగ్గొడుతున్న శబ్దం...

ఒక్కసారి ఉలిక్కిపడి లేచాడు శివతాండవ రావు.... ఆ వెంటనే చటుక్కున లేచి కూర్చుంది నాగవల్లి....

"నాగూ! ఏమిటా చప్పుళ్ళు కొంపదీసి దొంగలు కాదుకాదా?...." తన బెంగంతా బయట పెట్టాడు.

"అబ్బ మీకన్నీ అనుమానాలే.... ఎలక కోసం పరిగెడుతూ పిల్లి చేసిన హడావుడే అదంతా....వూరకే సణక్క పడుకోండి..." అని దప్పట్లో దూరి పోయింది నాగవల్లి.



# దొంగ

కె. కె.రఘునందన

కాని....మళ్ళా దడదడలాడుతూ శబ్దాలు... ఈసారి నాగవల్లికే ఒళ్ళంతా గగుర్పాటు మొదలైంది....దుప్పటి తీసేసి లేచి కూర్చుంది.

మొగుడు పెళ్ళాలిద్దరూ కళ్ళు, పత్తి కాయల్లా చేస్కుని భయంగా చూస్తుంటే....మరోసారి 'ఛడ్' మన్న చప్పుడయింది. మరో క్షణంలో ఇద్దరు వ్యక్తులు లోనికి సుడిగాలిలా దూసుకు వచ్చారు. ఒకడు కండలు తిరిగినట్టున్నాడు...మరోడు పీనుగుకి ప్రతి రూపమే!

"దొ....దొ....దొంగలు..." భీతిల్లి పోతూ అన్నది నాగవల్లి.

"అరిచారో చంపేస్తాం... ఏం తమాషాలు చేస్తున్నారా!"

దగ్గరగా వచ్చి పీక మీద చెయ్యేసి నిలబడ్డాడు ఏనుగులాంటి దావూద్.

మొలలోంచి కత్తి తీసి బెదిరించాడు పీనుగులాంటి డేవిడ్.

వాళ్ళను చూడ్డంతోటే పై ప్రాణాలు పైనే పోయాయి శివతాండవరావుకి...

"మీ ఇల్లు పీకి పందిరేసి...అదీయిదీ పట్టుకు పోయే గూండాలం కాదు..." అన్నాడు దావూద్.

"దొరికిందల్లా దోచుకుపోవటమే కాక.. చివర్న అడ్డంగా నరికి పారేసి పారిపోయే కసాయిలం అంత కన్నా కాదు" అన్నాడు డేవిడ్.

"మరి....మీరు...మీరు..." భయంగానే అడిగాడు

శివతాండవరావు.

''దొంగలం కామని మాత్రం అనుకోకండి...మా దాడి కేవలం ఏ శ్రమ లేకుండా అప్పనంగా దొచుకుంటున్న వారిమీదనే...'' సూటిగా చూస్తూ చెప్పాడు దావూద్...

''అయితే మా ఇంటికెందుకొచ్చినట్లో....'' కాస్త గొంతు విప్పింది నాగవల్లి.

''షటప్! మీరా జాబితాలో చేరారు కాబట్టి మీ ఇంటి మీద పడ్డాం....'' కోపంగా అన్నాడు డేవిడ్.

''బ్బె....బ్బె...బ్బె.... మేము మామూలు మధ్య తరగతి మనుషులం... మా....మీదకి..మీదాడి...'' వణికేగొంతుతో అన్నాడు శివతాండవ రావు.

''ఇంకా మధ్యతరగతి మనుషులమని చెప్పుకోడానికి సిగ్గులేదూ మీకు...'' గద్దించాడు డేవిడ్.

''అప్పనంగా బంగారం కొట్టేసి శ్రీమంతుల జాబితాలో చేరిపోయారు.... ఇంకా అబద్ధాలాడతారేం...'' కటువుగా పలికాడు దావూద్.

ఆ మాట వింటూనే బిక్కచచ్చిపోయినట్లుగా ఒకరి మొహాలొకరు చూసుకున్నారు శివతాండవ రావు, నాగవల్లి ఇంక బావురు మనటమే తరువాయి.

ఈ గడబిడకి ఉలిక్కిపడి లేచిన పాప కెవ్వుమన్నది.

''ఇంకా బిక్కమొహాలేస్తారేం చెప్పండి. మీరు టి.వి. వాళ్లు పెట్టే ప్రతీ అడ్డమైన పోటీకి హాజరయిపోయి.... వాళ్ళడిగే చెత్తాచెదారాల్లాటి ప్రశ్నలకి ఠకీఠకీమని జవాబులు చెప్పేసి పోగు చేసుకోలేదూ!'' హూంకరిస్తూ ప్రశ్నించాడు డేవిడ్.

''అబ్బే...మరి...మేమూ...'' నాన్చబోయాడు శివతాండవ రావు.

''అబద్ధాలాడినా సరే గోడ కట్టినట్లుండాలన్న మాటని నిజం చేయాలని చూడకండి. మీరు పోగు చేస్కున్న బంగారాన్ని దోచుకుపోవాలనే మేం వచ్చాం. అంతకుమించి మాకు పైసా కూడా అక్కర్లేదు...'' మీసాలు మెలేస్తూ పలికాడు దావూద్.

''ఊ ఇంకా గుడ్ల గూబల్లా చూస్తారేం...తెరవండి...మీ ఖజానా ఏ మాత్రం దాచడానికి ప్రయత్నించినా సరే మీ పీక తెగుద్ది...'' హెచ్చరించాడు డేవిడ్.

వారి చర్యలకి మిడిగుడ్లు వేసుకున్నది పాప!

నాగవల్లి అటు యిటు చూస్తూ మరింక లాభంలేదని బీరువా తెరచి బ్యాగు తీసి తెచ్చింది.

''మీరు టి.వి.ల మీద పడి అడ్డగోలుగా సంపాదించిన ఆ గోల్డ్ కాయిన్స్‌ను రౌండ్స్ ప్రకారం... అది కూడా మా లెక్కను బట్టి మీరు మాకు అప్పగించాలి'' అని కొండవీటి చాంతాడంత జాబితా ఒకటి బయటకు తీసాడు డేవిడ్.

''మొట్టమొదటసారిగా మీరు 'నీ ఒళ్ళు సింగారం కానూ' అనే ప్రోగ్రాం లో 'ఛమక్ ఛమక్' టి.వి. వాళ్ళు పెట్టిన 'తంతేబూర్లెగంప' అన్న రౌండ్‌లో మీరు సాధించిన పాయింట్లు పది... వాళ్ళు దానికి మూడు రెట్లు మీకిచ్చారు....అంటే ముఫై గ్రాములు బంగారం మీరు చేజిక్కించుకున్నారు...ముందుగా అది యిలా యివ్వండి...''

నాగవల్లికి ఆ రౌండు కళ్ళముందు తచ్చాడింది.

పాల్గొన్న వారందరి మీదకి ఓ ఎలక్ట్రానిక్ యంత్రం వస్తుంది. అది తోసిన తోపుకి ఒక్కొక్కరూ ఒక్కోగంపలో పడతారు. ఆగంపలో ఎన్ని పాయింట్లుంటే దానికి మూడురెట్లు బంగారం వారి దౌతుంది...జీరోగాని వస్తే అంతేసంగతులు.

''హు ఏమిటి ఆలోచిస్తున్నారింకా...తీయండి బయటకి'' హుంకరించాడు దావూద్.

తప్పలేదు నాగవల్లికి.

''ఇంక మీ ఇంటిల్లి పాదీ కలసి వెళ్ళిన మరో రౌండులో పకపక చకచక....లో మీరంతా ఆపకుండా పకపక నవ్వుతూ అందరికంటే ముందరున్నారు. మరి దాని విలువ ఎంతో తెలుసా...యాభై గ్రాములు! వాటిని కూడా బయటికి తీయండి'' అదిలించాడు డేవిడ్.

గబగబ బయటకు తీసిచ్చింది.

పసుపు పచ్చగా మిలమిలలాడుతున్న నాణేలను వాళ్లకి ధారపోస్తుంటే తెగ ఏడుపొచ్చేసింది.

''ఓ సందేహం! మీరిద్దరూ కూడా ఎంతో తెలివైన వాళ్లాలా కనిపిస్తున్నారు...మరి అంత తెలివి తక్కువ దద్దమ్మల్లా మన 'తెలుగు' పరువు తీశారు...ఛీ!'' విసుక్కున్నాడు దావూద్.

''మేం ఏం చేశామని...'' బెదిరాడు శివతాండవరావు.

''ఏం చేశారా...జీరో ప్లస్ టి.వి. వాళ్ళు అడిగిన తెలుగు సామెత గుర్తు కొచ్చిందా ఇప్పటికయినా....'' అంటూ మొహాల్లోకి చూశాడు దావూద్.

''ఔనౌను...అబ్బే...మరి...అది...అదీ...'' తటపటాయింపు ఎక్కువయింది నాగవల్లి...

''అదే మీరు దద్దమ్మలనడానికి సాక్ష్యం...దానికి క్లూ కూడా ఇచ్చారు...అయినా అందుకోలేకపోయారు. దానికి అర్థం కూడా చెప్పారు. స్క్రూలు బిగించడానికి ముందుగా చేసేది ఎలుకలు తరచుగా వీటిని చేస్తాయి అని...అయినా మీవి మట్టి బుర్రలే అయినాయా క్షణం...ఛఛ!!'' కస్సుమన్నాడు దావూద్.

''అప్పటికీ మా అమ్మకు సైగ చేసి చెబుతూనే ఉన్నా నంకుల్ అందుకోలేకపోయింది...ఛ! మరో పదిగ్రాముల బంగారం మా కొచ్చేది...'' పాప నిట్టూర్చింది.

''బాగా చెప్పావు..అప్పుడు మీ కొస్తే... ఇప్పుడు మా కొచ్చేది కదా! అదేగా మా గోల...'' విసుక్కున్నాడు దావూద్.

''గంపలాభం ఏది తీసింది అని అడిగారు. కానీ అప్పుడెంత తలబాదుకున్నా సరే జవాబు గుర్తు రాలేదు...'' అని నెత్తి మీద చేయి వేస్కున్నాడు శివతాండవ రావు.

డేవిడ్ తమలెక్క ప్రకారం చీటీ చూసుకున్నాడు. సరిగ్గా నూటయాభై గ్రాములకి మరో ఐదుగ్రాములు తేడా వచ్చింది.

''ఏం తమాషాగా ఉందా. మొదటి రౌండులో మీరు గెల్చుకున్న వాటికి మా లెక్కకు అయిదు గ్రాముల తేడా వచ్చింది. ముందది సెటిల్ చేయ్యండి... ఊఁ'' కత్తితో ఊదర గొట్టాడు డేవిడ్.

నాగవల్లి మరో ఆలోచన చెయ్యకుండా తీసిచ్చేసింది.

''అద్గదీ అలా గుండాలి... ఇంక 'లకలకలక' రౌండులో మీరు చంద్రముఖిలో జ్యోతికలా భయంకరంగా మేకప్ చేసుకొని నటించమంటే మీరు భలేగా బయపెట్టారే...చంద్రముఖి ఎన్ని సార్లు చూశారేంటి?'' అడిగాడు దావూద్.

''మొత్తం హాల్లో అయిదుసార్లు...సిడిలో మర్రెండుసార్లు'' ఈసారి పాప జవాబు యిచ్చింది.

''అందుకే కాబోలు దాంట్లోనూ మీ మమ్మీ విన్నర్...దానికి పాతిక గ్రాముల బంగారం కొట్టేసిందిగా....అదిప్పుడు మేం కొట్టేస్తున్నాం...తెండిలా....'' అడిగాడు దావూద్.

''మమ్మల్నెందుకిలా ప్రశ్నలేసి హింసిస్తారు? ఒక్కసారిగా అంత బంగారం పట్టుకుపోతే పోడా పోతుంది....'' తెగించి అనేశాడు శివతాండవ రావు.

''ఏం తోక జాడిస్తున్నారు! పీక తెగ్గోస్తా...మీరన్నట్లుగా వచ్చీరాగానే మూట గట్టుకు పోయేవాళ్ళం కాని అది మా కిష్టం లేదు... మీరెలాగయితే రౌండు రౌండుకీ బంగారం కొట్టేస్తూ ఆనందించారో అలాగే మేమూ ఫీలవ్వాలి...హ్హా హ్హా హ్హా....'' అంటూ వికటంగా నవ్వాడు డేవిడ్.

''ఇప్పటికి మా లెక్క ప్రకారం మీరు మాకు అప్పగించాల్సింది....మహా టి.వి. వారి నుండి గెల్చుకున్న బంగారం యాభైగ్రాములు వెరసి నూట యాభై గ్రాములు'' అని మొత్తం లెక్క చెప్పాడు దావూద్.

అప్పటితో వాళ్లు సంతృప్తిపడి వెళ్ళటానికి సిద్ధపడతారేమోనని సంతోషపడ్తుంటే...

''ఇక్కడితో మా దోపిడి పూర్తయిపోయిందని చంకలు గుద్దుకోకండి...మీరింకా మిగతా రౌండ్సులో ఉబ్బరంగా దోచుకున్న బంగారాన్ని మేం దోచుకో వద్దూ...'' ఆ మాట మాత్రం దొంగలిద్దరూ కూడబలుక్కుని అన్నారు.

మళ్ళీ గుండెలు గుభేలు మన్నాయి ఆ దంపతులకి...

''మీరు టాంటాం టి.వి.. వారినుండి డైరక్టుగా ఫోన్ అందుకుని వాళ్ళు పెట్టిన మెగా షోలో ఏర్పాటు చేసిన మొట్టికాయ లాటరీలో అత్యధికంగా మొట్టికాయలు తిన్న భర్తగా మొత్తం నూట పది గ్రాముల గోల్డ్ కాయిన్స్ మీకొచ్చాయి. అంత సమయం భరించి సంపాయించి ఇప్పుడు మా పరం చేస్తున్నందుకు సంతోషం...తెండిట్లా...'' అని శివతాండవ రావు నెత్తి వైపు చూసి పగలబడి నవ్వాడు దావూద్.

డేవిడ్ వంత పాడాడు.

మొట్టి కాయలు తిని బొప్పి కట్టించుకున్నది తను, గెల్చుకున్న బంగారం దోచుకుంటున్నది వీళ్ళూనా...హతవిధీ!

నూట పది గ్రాములు అర్పితమస్తు...!!

నాగవల్లికి ఒక్కసారిగా ఒళ్ళు మండింది. తమ

అదృష్టం పొగుడుతూ దోచుకుంటున్న వైనం బుగ్గ గిల్లి జోకొట్టేలా ఉంది.

''ఓరి దుర్మార్గులారా! మేమేదో కష్టపడి బంగారం గెలుచుకుంటే ఇలా మా మీదపడి దోచుకుంటారా! పురుగులుపడి ఛస్తారా!''లోలోపల తిట్టుకున్నది నాగవల్లి.

డేవిడ్ లెక్కడొక్కా సరి చూసుకుంటున్నాడు.

''గురువా! మనం చివరి రౌండు లెక్కించనే లేదు వాటి గురించి తేల్చేద్దామా!!'' డేవిడ్.

''చిటికెలో తేల్చెయ్యాలి ఇంక తెల్లారేలా ఉంది...'' హెచ్చరించాడు దావూద్.

''లెక్కేస్కో...!! ఫటాఫట్ టి.వి. వాళ్ళు పెట్టిన 'తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టండి' అన్న రౌండులో తిట్ల వర్షంలో ముంచెత్తినందుకు వీరికి కురిసిన కనకవర్షం ఎంతో తెలుసా...పావు కె.జి...'' డేవిడ్.

''హద్దదీ...బాగుంది.... నెక్స్ట్'' అన్నాడు దావూద్ ముచ్చటపడిపోతూ.

''అలాగే ధమాక్ టి.వి వాళ్ళు పెట్టిన బ్రద్దలు కొట్టండి-బంగారం పట్టుకుపోండి...! అన్న ప్రోగ్రాంలో వీళ్ళు కొట్టేసింది ఎంతో తెలుసా...అర కే.జి..''

''హుర్రే నెక్స్ట్...'' అరిచాడు దావూద్?

''వెరీ లక్కీ టి.వి వాళ్ళు 'బ్రహ్మముళ్ళు విప్పండి' అని ఓ నులకతాడును యిచ్చి ముళ్ళు విప్పమంటే చిటికెలో విప్పి పారేసిన ఘనత వీళ్లదే... దాని విలువ అక్షరాలా రెండొందల గ్రాములు...'' మొహంలో వెర్రిగా వెలుగు.

''అంటే మొత్తం తొమ్మిది వందల యాభైగ్రాములు మనకు బాకీ అన్నమాట...'' అన్నాడు దావూద్.

''ఓరి నీ పిండాకూడు పెట్టా! మేం నీకు బాకీనా?...మా టాలెంటుతో గోల్డ్ గెలుచుకుంటే దోపిడీకి వచ్చింది కాక బాకీగా జమ చేస్తున్నారా!'' నోట్లోనే తిట్టుకున్నది నాగవల్లి.

''ఏయ్! ఏమిటా మీన మేషాలు...మీరు మా ఖాతాకు జమ చేయాల్సింది తొమ్మిదివందల యాభైగ్రాములు... ఇలా ఈ సంచిలో పడేయండి... ఊఁ కమాన్....'' వేగిరపెట్టాడు దావూద్.

ఇదంతా చూస్తూ చాతావాతా కాని వాళ్ళలా తమబ్యాగులోని బంగారు నాణేలను వంపేసారు.

తళతళలాడుతూ పచ్చగా మెరుస్తున్న గోల్డ్ కాయిన్స్‌ను దోసిట్లోకి తీసుకుని తమ సంచిలోకి పడేస్కున్నారు డేవిడ్.

''ఊసూరుమనిపిస్తూంది కదూ పాపం!! మేమిలా మీ ఇంట్లోపడి మీ బంగారమంతా దోచేసుకుంటామని కలలో కూడా ఊహించ లేదు కదూ!'' అడిగాడు దావూద్.

''ఔను...మీరు మా మీద దయుంచి కనీసం ఓ నెక్లెస్ చేయించుకోటానికి యాభైగ్రాముల బంగారమన్నా విడిచి పెట్టండి... కాపురానికి వచ్చినాక మా ఆయన ఎలాగూ నాకు చేయించిన పాపాన పోలేదు.'' ప్రాధేయపడింది నాగవల్లి.

''నేనెలాగూ చేయించలేదు. ఈ టి.వి. ఛానల్స్ పుణ్యమాని బంగారం సంపాయించాం...దాంతోనయినా చేయిద్దామనుకున్నంతలోనే మీరిలా...'' అని శివతాండవ రావు అన్నాడో లేదో.....

''ఏడు వారాల నగలు చేయించాలనుకున్నావు...కానీ నో...ఛాన్స్'' కఠోరంగా చెప్పేశాడు డేవిడ్.

''అసలు మీమీద మేం ఎందుకు కనికరించాలట...మీరేమైనా చెమటల్లు చిందించి కష్టపడి సంపాదించారా? లేదే!? పోనీ మీ తాత ముత్తాతల సంపాదనా అంటే...అదీ కాదే..మీరు అప్పనంగా దోచుకున్నది ఈ బంగారం...అందుకనే మీరు దోచుకున్న దాన్ని మేం దోచుకున్నాం..తప్పేంటి..'' అన్నాడు దావూద్.

''ఈ మధ్య కాలంలో డబ్బున్నవాళ్ళు ఇళ్లలో చోరీ చేయాలన్నా... ఇంటికి తాళాలు పెట్టి వేరే చోటికి వెళ్లే వాళ్ళ ఇళ్ళ మీద పడదామన్నా సరే...షాపులు దోచుకుందామన్నా సరే పోలీసు గస్తీ ముమ్మరం చేశారు. అందువల్ల టి.వి. ప్రోగ్రాముల పుణ్యమాని బంగారం గెల్చుకున్న విజేతల వివరాలు డోర్‌నెంబర్, ఫోన్ నెంబర్లతో సహా పబ్లిగ్గా చూపిస్తున్నారు. కాబట్టి మీ దగ్గర ఎంతుందో మాకు ముందే తెలిసిపోవటంతో మాపని సులువైపోయింది. మీలాంటి కేసులు ఏడాదికి ఒకటి చాలు హ్యాపీగా గడిపేయచ్చు'' అని సంచీని భుజానికి తగిలించుకున్నాడు డేవిడ్.

''మీరు నిరాశపడి బంగారం కొల్ల గొట్టే ప్రోగ్రామ్‌లకు వెళ్ళటం మానకండేం. మీ బుర్రలు పదును పెట్టి గెలుచుకుంటే దోచుకోవటం మా లాంటి వారికి ఈజీ...!! వస్తాం... బై..బై...'' అని నవ్వుకుంటూ బయటికెళ్లిపోయాడు దావూద్.

వెనుకే డేవిడ్ కూడా...

పోలీసులకి చెబుదామని, సెల్‌ఫోన్ కోసం వెతికితే కనిపించలేదు... ల్యాండ్ ఫోన్ చెయ్యబోతే తెగిన వైరు వెక్కిరించింది.

ఒక్కసారి బోరుమన్నది నాగవల్లి.

''ఏడు... ఇంకా ఏడు...చెప్పింది విన్నావా?.... గెల్చుకున్నదాన్ని వెంటనే బ్యాంకు లాకర్లో పెట్టేద్దామన్నాను. కానీ వింటేనా! అత్యధిక బంగారం గెలుచుకున్న వనితగా ఇంటర్వ్యూలిచ్చావు. అమ్మలక్కలందరి ఇళ్ళకీ తీసుకెళ్ళి చూపించావు...అనుభవించాల్సిందే...'' చిరాకెత్తి వెర్రెత్తిపోయాడు శివ తాండవ రావు.

''ఇలా టి.వి.లో బంగారం గెల్చుకున్న వారిళ్ళ మీద కన్నేసే దొంగలుంటారని నేను మాత్రం కలగన్నానటండీ...'' మళ్ళా ఘొల్లుమన్నది.''

అది చూసిన పాప కూడా బావురుమన్నది.

*



## రూటు మార్చిన మీరాజాస్మిన్

పదహారణాల తెలుగు అమ్మాయిలా లంగా ఓణీలోనో లేదా నిండుగా చీరలోనో ప్రేక్షకులకు కనువిందు చేసే మీరాజాస్మిన్ ఇప్పుడు రూటు మార్చిందా అన్న అనుమానాన్ని కొందరు వ్యక్తం చేస్తున్నారు. పేరుకు మళయాళీ నటి అయినా ఎక్కువగా పేరు తెచ్చుకున్నది తెలుగు చిత్రాల ద్వారానే. అయితే ఇటీవలే విడుదలైన యమగోల, మళ్లీ మొదలైంది చిత్రంలో గ్లామరస్‌గా కనిపించి తన అభిమానులను, సినీ ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. పాత్రల పరంగా ఆ మాత్రం గ్లామర్ తప్పనిసరి అని పైకి చెపుతున్నా భవిష్యత్తులో అదే 'గ్లామర్'ను కొనసాగించాలని చూస్తున్నట్లుంది. తమిళంలో కార్తీక్‌తో నటించిన ముద్దు సీను కూడా వివాదాస్పదంగా మారడంతో మొత్తానికి మీరా రూటు మార్చిందన్న నిర్ణయానికి వచ్చేస్తున్నారు.